సాక్షి అనంతపురం

ఆదివారం । 24 । డిసెంబర్ । 2023



టమాట కిలో రూ.16

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.16 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



ప్రజా ప్రభుత్వానికి అండగా ఉందాం

ప్రజల బాగుకు కృషి చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలుద్దామని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. 8లో

గరిష్టం/కనిష్టం
32.7°/11.5°

జిల్లాలో శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి తీవ్రత బాగా పెరిగింది. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

రేపు 'స్పందన' ఉండదు

అనంతపురం అర్బన్: క్రిస్మస్ పండుగ సెలవు కారణంగా ఈ నెల 25న కలెక్టరేట్‌లో జరగాల్సిన 'స్పందన' కార్యక్రమం రద్దు చేసినట్లు డీఆర్‌ఓ గాయత్రీదేవి శనివారం తెలియజేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి అర్జీలు ఇచ్చేందుకు జిల్లా కేంద్రానికి రావద్దని సూచించారు.

సమన్వయంతోనే కేసుల పరిష్కారం

- జిల్లా జడ్జి జి.శ్రీనివాస్




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి జి. శ్రీనివాస్

హిందూపురం అర్బన్: న్యాయాధికారులు, న్యాయవాదులు సమన్వయంతో పనిచేస్తే కేసుల సత్వర పరిష్కారానికి వీలు కలుగుతుందని, ఈ దిశగా అందరం కృషి చేద్దామని ఉమ్మడి అనంతపురం జిల్లా జడ్జి జి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన జిల్లా కోర్టుతో పాటు, కోర్టు ప్రాంగణంలోని అన్ని కోర్టులను పరిశీలించి పలు సూచనలు చేశారు. సీనియర్ సివిల్ కోర్టు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా జడ్జి మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా కోర్టుల్లో న్యాయాధికారులు, సిబ్బంది కొరత అంశాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే ఉన్నత న్యాయస్థానం తగు చర్యలు తీసుకుంటుందన్నారు. పనిభారం ఉన్నా స్థానిక న్యాయమూర్తులు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారని అభినందించారు. అనంతరం కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా జడ్జిని సన్మానించి మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి వెంట అదనపు జిల్లా జడ్జి శైలజ, సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి ఉన్నారు.

కేసుల పరిష్కారానికి కృషి చేయండి

పెనుకొండ: లోక్‌అదాలత్ ద్వారా ఎక్కువ కేసులు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఉమ్మడి అనంతపురం జిల్లా జడ్జి జి.శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, లోక్ అదాలత్‌లో సాధ్యమైనన్ని కేసులు పరిష్కరించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

తెల్లారిన బతుకులు



మృతులు చిన్న తిప్పయ్య, పసులోరు శ్రీరాములు, కండ్లపల్లి నాగార్జున, మామిళ్లపల్లి శ్రీనివాసులు (ఫైల్)



పామిడి ప్రభుత్వాస్పత్రి వద్ద రోదిస్తున్న మృతుల బంధువులు



సంఘటన స్థలంలో మృతదేహాలు

ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం మిల్లులో ఆడించుకుని ఇంటికి వస్తున్న రైతులపై మృత్యువు పంజా విసిరింది. మరో గంటలో ఇంటికి చేరుకోవాల్సిన వారిని రోడ్డు ప్రమాదం కబళించింది. రెప్పపాటులో ఈ ఘోరం జరిగిపోయింది. నలుగురు రైతులు బస్సు చక్రాల కిందపడి ప్రాణం విడిచారు. మరొక రైతు గాయాలతో బయటపడ్డాడు. మృతులందరూ సమీప బంధువులే. కుటుంబ సభ్యులు ప్రమాద స్థలికి చేరుకుని దేవుడా ఎంత పనిచేశావయ్యా అంటూ రోదించారు. మేమెలా బతకాలయ్యా అంటూ గుండెలవిసేలా రోదించారు. వారిని ఓదార్చడం ఎవరితరమూ కాలేదు.

- ట్రాక్టర్‌ను ఢీకొన్న ప్రైవేట్ బస్సు
- నలుగురు రైతుల దుర్మరణం
- మిన్నంటిన బంధువుల రోదనలు
- జాతీయరహదారిపై ఆందోళన
- మాముడూరులో విషాద ఛాయలు

గార్లదిన్నె/గుత్తి రూరల్/ పామిడి: చిమ్మ చీకటి.. ఇంతలో భారీ శబ్దం. బస్సులోంచి హాహాకారాలు. బస్సు ముందు భాగంలో ట్రాక్టర్ బోల్తాపడి ఉంది. నాలుగు మృతదేహాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. గార్లదిన్నె మండలం కల్లూరు వద్ద శనివారం తెల్లవారుజామున బియ్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుకనుంచి ప్రైవేట్ ఓల్వో బస్సు ఢీకొంది. ప్రమాదంలో గుత్తి మండలం మాముడూరుకు చెందిన రైతులు కండ్లపల్లి చిన్న తిప్పయ్య(47), పసులోరు శ్రీరాములు (42), కండ్లపల్లి నాగార్జున (32), మామిళ్లపల్లి శ్రీనివాసులు (27) మృతి చెందారు. ఎడమ వైపునకు ఎగిరి ముళ్ల పొదల్లోకి పడ్డ మరో రైతు పసులోరు హరికృష్ణ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతులు, గాయపడిన వ్యక్తి అందరూ సమీప బంధువులే.



నుజ్జునుజ్జయిన ట్రాక్టర్



ప్రమాదానికి కారణమైన ప్రైవేట్ ఓల్వో బస్సు

మిన్నంటిన రోదనలు..

రోడ్డు ప్రమాద వార్త తెలియగానే మాముడూరు గ్రామం ఉలిక్కిపడింది. వైకుంఠ ఏకాదశి కావడంతో అందరూ తెల్లవారుజామునే లేచారు. సమీప బంధువులైన నలుగురు రైతుల మరణ వార్త కలచివేసింది. కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు కల్లూరు సమీపంలోని ప్రమాద స్థలికి భారీ ఎత్తున చేరుకున్నారు. చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలను చూసి కంట తడిపెట్టారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్‌కు శాపనార్థాలు పెట్టారు. జాతీయరహదారిపై ఆందోళనకు దిగారు. మృతి చెందిన వారికి బస్సు యజమాని రూ.20 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని, అంత వరకూ మృతదేహాలను ఇక్కడి నుంచి పక్కకు తీసేదే లేదని డిమాండ్ చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో శింగనమల సీఐ అస్రార్‌బాషా, పామిడి సీఐ రాజశేఖరరెడ్డి, గార్లదిన్నె ఎస్‌ఐ సాగర్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆందోళనకారులకు నచ్చజెప్ప ప్రయత్నం చేసినా ఒప్పుకోలేదు. దాదాపు గంటపాటు ఆందోళన కొనసాగింది. అనంతరం మృతదేహాలను పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం పామిడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని గార్లదిన్నె తహసీల్దార్ ఉషారాణి తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలు స్వగ్రామానికి చేరుకోగానే విషాదం అలుముకుంది. సాయంత్రం నలుగురి అంత్యక్రియలూ అశ్రునయనాల మధ్య పూర్తి చేశారు.

మృతుల కుటుంబ నేపథ్యం..

- రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారందరూ వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నవారే. మృతుల్లో రైతు చిన్న తిప్పయ్యకు భార్య లక్ష్మీదేవి, కుమారులు అనిల్, పురుషోత్తం ఉన్నారు. తిప్పయ్య మరణ వార్త తెలియగానే కుటుంబ సభ్యులు షాక్‌కు గురయ్యారు.
- మరో మృతుడు శ్రీరాములుకు భార్య లక్ష్మి, కుమార్తెలు సునీత, ఇందు ఉన్నారు. కుటుంబ యజమాని మృతితో పిల్లలు దిక్కులేని వారయ్యారని లక్ష్మి రోదించింది.
- ఇంకో మృతుడు నాగార్జునకు భార్య జయలక్ష్మి, కుమారుడు అభినయ్, కుమార్తె మన్విత ఉన్నారు.
- శ్రీనివాసులుకు భార్య మౌనిక, నాలుగు నెలల కుమారుడు ఉన్నారు. దేవుడా మేమేం పాపం చేశామయ్యా.. ఇంత పని చేశావు. మేమెలా బతకాలి దేవుడా అంటూ మౌనిక కన్నీటి పర్యంతమయ్యింది.

అంతా రెప్పపాటులో జరిగిపోయింది

- ప్రత్యక్ష సాక్షి పసులోరు హరికృష్ణ



కల్లూరు మిల్లులో వడ్లు ఆడించుకొని ట్రాక్టర్‌లో బియ్యం లోడ్ చేసుకొని మాముడూరుకు వస్తుండగా రెప్పపాటులో ప్రమాదం జరిగిందని ఆ ప్రమాదంలో మృత్యుంజయుడిలా బయటపడ్డ ప్రత్యక్ష సాక్షి పసులోరు హరికృష్ణ చెప్పారు. 'మిల్లులో వడ్లు ఆడించడం అర్ధరాత్రి పూర్తి కావడంతో శనివారం తెల్లవారుజామున ట్రాక్టర్‌లో బియ్యం బస్తాలు లోడ్ చేసుకొని నేను, చిన్న తిప్పయ్య, శ్రీరాములు, నాగార్జున బస్తాలపై కూర్చోగా.. శ్రీనివాసులు ట్రాక్టర్ నడుపుతున్నాడు. అయితే పామిడి పెన్నా బ్రిడ్జి వద్దకు రాగానే ప్రైవేట్ బస్సు వెనుక నుంచి ఒక్క సారిగా వేగంగా వచ్చి ఢీకొట్టడంతో ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడింది. నేను రోడ్డుకు ఎడమ వైపు పడగా.. శ్రీనివాసులు, చిన్న తిప్పయ్య, శ్రీరాములు, నాగార్జున కుడి వైపు పడ్డారు. చిమ్మ చీకటిలో ఏం జరుగుతోందో నాకు అర్థం కాలేదు. అంత రెప్పపాటులో జరిగిపోయింది. రోడ్డు పక్కన కంపచెట్లలో పడ్డ నేను మెల్లిగా తేరుకొని వచ్చి చూడగా బస్సులో ప్రయాణికులు హాహాకారాలు చేస్తున్నారు. డ్రైవర్ బస్సులో ఇరుక్కొని బిగ్గరగా అరుస్తున్నాడు. కొద్దిసేపు ఏం జరిగిందో తెలియలేదు. 10 నిమిషాల తరువాత అటుగా వెళ్లేవారు, సమీపంలో రైస్ మిల్లుల వద్ద ఉన్న వారు వచ్చి మాకు సహాయం చేశారు. మా వాళ్ల కోసం నేను చుట్టుపక్కలంతా గాలించినా కనపడలేదు. బస్సు కింద పడి వారంతా మరణించారని అక్కడ ఉన్న వారు చెప్పారు. ఎలా జరిగిందని అడిగితే బస్సు బ్రేక్ ఫెయిలై ట్రాక్టర్‌ని వెనుక నుంచి ఢీకొట్టిందని కొందరు చెప్పారు. అంతలోనే 108 అంబులెన్స్ రావడంతో నన్ను ఆస్పత్రికి తీసుకెళ్లారు. అంతా క్షణాల్లోనే జరిగిపోయింది'అంటూ హరికృష్ణ కంటతడి పెట్టాడు.

రోడ్డు ప్రమాదం బాధాకరం

అనంతపురం అర్బన్: కల్లూరు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదం బాధాకరమని కలెక్టర్ గౌతమి అన్నారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకుంటుందని ఒక ప్రకటనలో తెలిపారు. మృతి చెందిన వారిలో నాగార్జున, శ్రీరాములు, తిప్పయ్య వైఎస్సార్ బీమాలో నమోదైనందున వీరికి రూ.5లక్షల బీమా వర్తిస్తుందని తెలిపారు. మరో మృతుడు శ్రీనివాసులు వైఎస్సార్ బీమాలో నమోదు కానందున ప్రభుత్వం నుంచి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు.

బాధితులను ఆదుకుంటాం



మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

కల్లూరు శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చిన్న తిప్పయ్య, శ్రీరాములు, నాగార్జున, శ్రీనివాసులు కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి తెలిపారు. పామిడి ప్రభుత్వాస్పత్రిలో నలుగురి మృతదేహాలను ఎమ్మెల్యే పరిశీలించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రమాదంపై సీఎం జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన విచారం వ్యక్తం చేశారన్నారు. బాధిత కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారన్నారు. మృతి చెందిన వారికి తనవంతుగా ఒక్కో కుటుంబానికి రూ.50వేలు చొప్పున ఎమ్మెల్యే వైవీఆర్ ఆర్థికసాయం అందించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి, మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రవీణ్‌కుమార్ యాదవ్, నాయకులు రంగస్వామి, మాజీ సర్పంచ్ తిమ్మారెడ్డి, కాశీనాథ్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, ఎస్సీ సెల్ మల్లికార్జున, శాలివాహన సంఘం నేత నాగేంద్ర, పామిడి పట్టణ కన్వీనర్ జోజోడే కుమార్, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు.

ముక్కోటి.. జనకోటి



కదిరి నృసింహాలయంలో ఉత్తర ద్వారం వద్ద క్యూలైన్లో భక్తులు (ఇన్‌సెట్) ఖాద్రీశుడు

గోవింద నామస్మరణతో ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రతిధ్వనించింది. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం శ్రీవారిని ఉత్తర ద్వారం గుండా దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలిరాగా, వైష్ణవాలయాలన్నీ కిటకిటలాడాయి. అనంతపురంలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయం, చెన్నకేశవ ఆలయం, కదిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంతో పాటు పలు ఆలయాల వద్ద తెల్లవారుజామునే భక్తుల తాకిడి విపరీతంగా పెరిగిపోయింది. ముక్కోటి ఏకాదశి నాడు ముక్కోటి దేవతలు భూలోకానికి వచ్చి శ్రీ మహా విష్ణువును పూజిస్తారని అర్చకులు తెలిపారు. అందుకే ఈరోజు ఆలయాల్లో ఉత్తర ద్వారం గుండా స్వామివారిని దర్శించుకుంటే సమస్త పుణ్య పరంపరలు చేకూరుతాయని అర్చక పండితులు భక్తులకు వివరించారు.

– అనంతపురం కల్చరల్



అనంతపురం: అలంకరణలో చెన్నకేశవస్వామి



అనంతపురం: పాతూరు చెన్నకేశవస్వామి దర్శనానికి బారులుదీరిన భక్తులు

ఎన్నికల 'బదిలీలు' షురూ..

- మూడేళ్లు సర్వీసు పూర్తయిన వారికి స్థాన చలనం
- సొంత జిల్లాలోని అధికారులకు బదిలీ తప్పనిసరి
- ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ

అనంతపురం అర్బన్: పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం సమాయత్తమవుతోంది. ఎన్నికల నిర్వహణలో నేరుగా సంబంధం ఉన్న ఏ అధికారినీ ఒకే చోట కొనసాగించకూడదని స్పష్టం చేసింది. వారి బదిలీలకు సంబంధించిన నిబంధనలు, మార్గదర్శకాలతో కూడిన ఉత్తర్వులను ఎన్నికల కమిషన్ ఈ నెల 21న జారీ చేసింది. ఎన్నికల విధుల్లో భాగమైన జిల్లా ఎన్నికల అధికారి (డీఈఓ), డిప్యూటీ డీఈఓ, రిటర్నింగ్ అధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, నోడల్ అధికారులను బదిలీ చేయాల్సి ఉంటుంది. సొంత జిల్లాలో పనిచేస్తున్న అధికారులను, ఒకే జిల్లాలో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న అధికారులను బదిలీ చేయాలని ఆదేశాలిచ్చింది. అయితే 2024 జూన్ నాటికి ఉద్యోగ విరమణ చేయనున్న అధికారులకు బదిలీ నుంచి మినహాయింపు ఇచ్చింది. అదే విధంగా ఎన్నికల విధులు నిర్వర్తించే సెక్టోరల్, జోనల్ అధికారులకు బదిలీ నుంచి మినహాయింపు ఇచ్చారు.

డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్ల బదిలీ..

ఎన్నికల విధుల్లో డిప్యూటీ కలెక్టర్లు ఆర్‌ఓలు, ఈఆర్‌ఓలుగా ఉంటారు. ఇక తహసీల్దార్లు ఏఆర్‌ఓ, ఏఈఆర్‌ఓలుగా ఉంటారు. కాబట్టి ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం వీరందరినీ బదిలీ చేస్తారు. అదే క్రమంలో ఎన్నికల నిర్వహణలో వివిధ కార్యక్రమాలకు సంబంధించి నోడల్ అధికారులుగా వ్యవహరిస్తున్న జిల్లా అధికారులను బదిలీ చేయాలని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది.

పోలీసు అధికారులకు బదిలీ..

ఎన్నికలతో నేరుగా సంబంధం ఉన్న పోలీసు అధికారులను బదిలీ చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. సబ్ ఇన్‌స్పెక్టర్ ఆపై స్థాయి అధికారులకు సొంత జిల్లాలో పోస్టింగ్ ఇవ్వకూడదు. ఒకే చోట మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న, పూర్తి చేసుకోనున్న సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేసే విషయంలో స్పష్టమైన మార్గదర్శకాలు, నిబంధనలను ఎన్నికల కమిషన్ తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

క్లుప్తంగా

యంత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలి



యంత్రాల నాణ్యతను పరిశీలిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: యంత్రాల నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించాలని కేంద్ర వ్యవసాయ శాఖ సంయుక్త కార్యదర్శి రుక్మిణి, కమిషనర్ డాక్టర్ వీఎన్ కాలే పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్ర శిక్షణ, పరీక్షణ సంస్థ (ట్రాక్టర్ నగర్)ను వారు సందర్శించారు. యంత్రాల పరిశీలన తీరును పరిశీలించారు. శిక్షణ, ఫాం విభాగాలను తనిఖీ చేసి, సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కువ యంత్రాలను పరీక్షించేలా చొరవ చూపాలన్నారు. సంస్థ అభివృద్ధికి కలసికట్టుగా కృషి చేయాలన్నారు. అనంతరం టెస్టింగ్ పద్ధతులపై యంత్రాల కల్లిబ్రేషన్, నిర్వహణపై శిక్షణ తీసుకున్న పలువురు శాస్త్రవేత్తలు, ఇంజినీర్లకు వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ట్రాక్టర్ నగర్ సంస్థ డైరెక్టర్ డాక్టర్, నాందేడే, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

అనంతపురం రూరల్: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ గ్రంధి వెంకటేష్ హెచ్చరించారు. శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్ట విరుద్ధమన్నారు. ఆడ, మగ ఇద్దరూ సమానమేనన్నారు. దీనిపై ప్రతి గ్రామంలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అన్ని శాఖల అధికారులపై ఉందన్నారు. స్కానింగ్ సెంటర్లపై నిఘా ఉంచాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యులు యుగంధర్, నిస్సార్‌బేగం, రవి తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలే విజయ సోపానం

- సివిల్స్ టాపర్ బాలాలత
- సాక్షి మీడియా ఆధ్వర్యంలో 'గ్రూప్–1, 2'పై ఉచిత అవగాహన సదస్సు
- పెద్ద సంఖ్యలో హాజరైన యువత



అవగాహన సదస్సుకు హాజరైన యువత



మాట్లాడుతున్న బాలాలత

అనంతపురం కల్చరల్: పట్టుదలతో ముందుకు సాగితే విజయం సాధించడం సులువేనని సివిల్స్ టాపర్ బాలాలత అన్నారు.
రాష్ట్రంలో 81 గ్రూప్–1, 897 గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలోనే గ్రామీణ, పట్టణ విద్యార్థులను గ్రూప్–1, 2 స్థాయి ఉద్యోగులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సాక్షి ఎడ్యుకేషన్.కామ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉచిత అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. శనివారం అనంతపురంలో నిర్వహించిన సదస్సుకు విశేష స్పందన లభించింది. స్థానిక ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు. గెస్ట్ స్పీకర్‌గా బాలాలత హాజరై గ్రూప్–1, 2 పరీక్షలపై అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థుల సందేహాలు నివృత్తి చేశారు. ఆమె మాట్లాడుతూ విజయసాధనలో వైకల్యం, ధనబలం, మీడియం ఆఫ్ ఎడ్యుకేషన్ వంటివి ఏ మాత్రం ప్రభావం చూపించవన్నారు. మన మీద మనకున్న నమ్మకం, ప్రణాళికే విజయతీరాలకు చేరుస్తాయన్నారు. అనంతరం రాష్ట్ర భౌగోళిక స్వరూపం, తీర ప్రాంతం, జిల్లాల పునర్విభజన, రాష్ట్ర బడ్జెట్, జాతీయ, అంతర్జాతీయ అంశాలను ఎలా చదవాలనే విషయలను క్షుణ్ణంగా వివరించారు. అనంతరం ప్రశ్నోత్తరాల పద్ధతిలో హాజరైన వారి సందేహాలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో సాక్షి బ్రాంచి మేనేజర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

సాక్షి యాజమాన్యానికి కృతజ్ఞతలు



ఏపీపీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్నా. ఈ క్రమంలోనే 'సాక్షి' ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్న విషయం తెలుసుకుని ఇక్కడకు వచ్చా. గతంలో నేను హాజరైన సదస్సుల కంటే ఇది పూర్తి భిన్నం. బాలాలత మేడం అన్ని అంశాలను చక్కగా వివరించారు. మేడం మాటలతో ఎంతో స్ఫూర్తినిచ్చాయి. 'సాక్షి' యాజమాన్యానికి కృతజ్ఞతలు.
– అభిషేక్, వడ్రవన్నూరు గ్రామం

ఎంతో మేలు



గ్రూప్ 2 పరీక్షలకు సిద్ధమవుతున్నా. ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో ఉన్నా. 'సాక్షి' మీడియా వారు అవగాహన సదస్సు నిర్వహించడం ఆనందదాయం. కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు "సాక్షి ఎడ్యుకేషన్.కామ్" తోడుగా ఉంటోంది. ఇటువంటి సదస్సులు యువతకు ఎంతో మేలు చేస్తాయి. – అక్షయ, తాడిపత్రి

భయం పోయింది



మొదటిసారి అవగాహన సదస్సుకు హాజరయ్యా. పోటీ పరీక్షలకు ఎలా చదవాలో తెలుసుకున్నా. ప్రణాళికాబద్ధంగా చదివితే ఎంతటి ఉద్యోగమైనా సులువుగా సాధించవచ్చని అర్థమైంది. నాలాంటి యువతకు ఈ అవగాహన సదస్సు చాలా బాగా ఉపయోగపడుతుంది. భవిష్యత్తులో ఇలాంటివి మరిన్ని నిర్వహించాలని కోరుకుంటున్నా. – సరిత, అనంతపురం

ఉద్యోగం సాధిస్తాననే నమ్మకం పెరిగింది



ఎంబీఏ పూర్తి చేశా. ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలకు సాధన చేస్తున్నా. పోటీ పరీక్షలకు ఎలా చదవాలో తెలియని నాలాంటి ఎంతో మందిలో బాలాలత మేడం స్ఫూర్తి రగిలించారు. వైకల్యాన్ని జయించి ఆమె సాధిస్తున్న విజయాలు స్ఫూర్తిదాయకం. సదస్సుకు హాజరవడం ఎంతో సంతోషంగా ఉంది. ఉద్యోగం సాధిస్తాననే నమ్మకం పెరిగింది.
– శర్మాస్ వలి, రాయదుర్గం

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ దుర్మరణం

పామిడి: రోడ్డు ప్రమాదంలో ఐషర్ డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. 44వ నంబర్ జాతీయ రహదారిలో పెన్నా నది వంతెనపై శనివారం వేకువజామున ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. పామిడి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం నుంచి హైదరాబాద్‌కు టమాట లోడుతో డ్రైవర్ వెంకటరమణ బయలుదేరాడు. పెన్నా నది వంతెనపై టైర్ పంక్చరై ఆగి ఉన్న లారీని వేగంగా ఢీకొన్నాడు. ప్రమాదంలో తీవ్రగాయాలు కావడంతో వెంకటరమణ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. క్లీనర్ రాజు సురక్షితంగా బయటపడ్డాడు. మృతుడిది అన్నమయ్య జిల్లా మెలకలచెరువు పట్టణంలోని నల్లగుట్టపల్లి వీధివాసి అని తెలిసింది. భార్య రమణమ్మ, ఒక కుమారుడు, కుమార్తె సంతానం. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా ప్రభుత్వానికి అండగా ఉందాం

- న్యాయవ్యవస్థను తప్పుదారి పట్టిస్తున్న వారికి బుద్ధి చెబుదాం
- వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్ రెడ్డి పిలుపు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్ రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: అభివృద్ధి, సంక్షేమంతో ప్రజల బాగుకు కృషి చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలుద్దామని పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం గుత్తిరోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లా లీగల్ సెల్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మనోహర్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లింగాల లోకేశ్వర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయాల్లో విలువలు లోపించాయన్నారు. టీడీపీ, జనసేన నేతలు కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతూ దిగుజారుడు రాజకీయాలు చేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమ్మ ఒడి, గోరుముద్ద, ఇంగ్లిష్ మీడియం, ఇళ్ల స్థలాలు తదితర సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడితే, వాటిని అడ్డుకునేందుకు టీడీపీ నేతలు, వారి అనుచరులు హైకోర్టులో 211 పిల్స్ దాఖలు చేశారన్నారు. గతంలో ఏదైనా నష్టం జరిగితే పిల్ వేసే పరిస్థితి ఉండేదని, నేడు ప్రజలకు మంచి చేస్తున్నా ఓర్వలేకపోవడం దౌర్భాగ్యమన్నారు. న్యాయవ్యవస్థను తప్పుదారి పట్టిస్తున్న వారికి బుద్ధి చెబుదామని పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్ పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి విషయంలో ఎక్కడా వెనుకడుగు వేయకుండా ముందుకెళ్లడం గర్వకారణమన్నారు. న్యాయపరమైన అడ్డంకులు లేకుంటే మరింత అభివృద్ధి జరిగేదన్నారు. టీడీపీ ప్రభుత్వంలో స్కాంలు చేసిన వారు జైలుకెళ్లేలా లీగల్ సెల్ కృషి చేసిందన్నారు. 40 ఏళ్లుగా వ్యవస్థలను మేనేజ్ చేసుకుంటూ వస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబునూ జైలుకు పంపామన్నారు. ఇందులో ఎలాంటి రాజకీయం లేదన్నారు. 2017–18లోనే సెంట్రల్ జీఎస్టీ వారు షెల్ కంపెనీ ద్వారా రూ.371 కోట్లు తరలిపోయాయని చంద్రబాబు ప్రభుత్వాన్ని హెచ్చరించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. టీడీపీ, జనసేనలకు మద్దతుగా ఎల్లో మీడియా పని చేస్తోందని, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నట్లు ఈ మీడియా మారీచులను ఎదుర్కొనేందుకు సిద్ధమవ్వాలని కోరారు. టీడీపీ అరాచక పాలన, వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళదామని పిలుపునిచ్చారు.

జగన్‌ను మళ్లీ సీఎంను చేసుకుందాం..

వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ సభ్యులు చురుగ్గా ఉండాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి తెలిపారు. న్యాయస్థానాల్లో అనవసరంగా కేసులు వేస్తూ ప్రజలకు జరిగే మేలు అడ్డుకుంటున్న ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పాలన్నారు. అందరం ఐకమత్యంగా సాగి, జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో న్యాయవాదుల పాత్ర చాలా ఉందన్నారు. విశ్రాంత జడ్జి కిష్టప్ప మాట్లాడుతూ మేనిఫెస్టో కమిటీ సభ్యుడిగా ఉన్న సమయంలో న్యాయవాదులకు ప్రతి నెలా గౌరవ వేతనం ఇవ్వాలని ప్రతిపాదనలు పంపానని, అందుకు తగ్గట్టుగానే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి న్యాయవాదులకు లా నేస్తం కింద రూ.5,000 అందిస్తున్నట్లు తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి సీఎం అయితే విజయవాడలో లా అకాడమీ ఏర్పాటు సాకారమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో లీగల్ సెల్ అనంతపురం జిల్లా అధ్యక్షుడు ఉమాపతి, శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు ప్రసాదరెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు హరినాథ్ రెడ్డి, రాజశేఖర్ యాదవ్, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి సీ రామచంద్రారెడ్డి, కురుబ నాగిరెడ్డి, భాస్కర్‌గౌడ్, నాయకులు బాబ్జి, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ వెన్నపూస రవీంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను వంచించిన పరిటాల కుటుంబం

- అవినీతి, అక్రమాలతో రూ. కోట్ల దోపిడీ
- టెండర్ దక్కించుకుని రోడ్లు పూర్తి చేయకుండా మోసం
- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్: ఎంతో నమ్మకంతో అధికారం కట్టబెట్టిన ప్రజలను పరిటాల కుటుంబం వంచించిందని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విమర్శించారు. టీడీపీ హయాంలో అవినీతి, అక్రమాలతో రూ. కోట్లకు పడగలెత్తారని విమర్శించారు. శనివారం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఫిబ్రవరి 16న పరిటాల బంధువులకు చెందిన ఎస్‌కేసీ కన్‌స్ట్రక్షన్ అనే సంస్థ ధర్మవరం నియోజకవర్గంలో 19, రాప్తాడు నియోజకవర్గంలో 33 మొత్తం 52 రోడ్ల నిర్మాణాలకు రూ.57.49 కోట్లతో టెండరు దక్కించుకుందన్నారు. 18 నెలల్లో పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. అగ్రిమెంట్ అయిన తర్వాత పనులు పూర్తి చేయాలని, ఒక వేళ చేయకున్నా ఇతరులు చేపట్టే అవకాశం లేకుండా నిబంధనలు చేర్చారన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో కేవలం 3 రోడ్లు, అదీ బీటీ కూడా వేయకుండా పూర్తి చేశారన్నారు. మిగిలిన రోడ్లు వేయకుండా నరకం చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిటాల శ్రీరామ్‌కు ధర్మవరం నియోజకవర్గ టికెట్ ఇస్తారనే ఆశతో అక్కడ మాత్రం 19 రోడ్లకు 16 రోడ్ల పనులు పూర్తి చేశారన్నారు. రోడ్లు పెండింగ్ పెట్టిన గ్రామాలకు తాము వెళ్లి, కాంట్రాక్ట్ తీసుకున్న వారు ఎందుకు పెండింగ్ పెట్టారో నిలదీయాలని ప్రజలను కోరతామన్నారు. పరిటాల సునీత నాలుగున్నరేళ్ల తర్వాత రాప్తాడులో పర్యటిస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధి చేయలేదనడం హాస్యాస్పదమన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నియోజకవర్గంలో రూ. 2,500 మేర ఖర్చు చేసినట్లు వెల్లడించారు.

క్రీడాహబ్‌గా మార్చేందుకు చర్యలు..

ఆంధ్రప్రదేశ్‌ను క్రీడాహబ్‌గా మార్చేందుకు సీఎం జగన్ చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలను విజయవంతం చేయాలని యువతకు పిలుపునిచ్చారు. క్రీడాకారులకు అన్ని వసతులు కల్పిస్తామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ముందుచూపుతో యువతను ప్రోత్సహించేందుకు కార్యక్రమాన్ని చేపడుతున్నారన్నారు. తాను కూడా వివిధ క్రీడల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. రాప్తాడు నియోజవర్గంలో వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, బ్యాడ్మింటన్, ఖోఖో క్రీడలకు పలు జట్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆది, ధనుంజయ యాదవ్, చిట్రా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సేవా భావం స్ఫూర్తిదాయకం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- ఘనంగా ప్రీ క్రిస్మస్



కొవ్వొత్తులు వెలిగించిన ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, జేసీ కేతన్ గార్గ్ తదితరులు

అనంతపురం కల్చరల్: క్రైస్తవుల సేవా భావం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. స్థానిక అరవిందనగర్‌లోని సీఎస్ఐ చర్చిలో జిల్లా మైనార్టీ శాఖ ఆధ్వర్యంలో శనివారం ప్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయగిరిజమ్మ, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర రెడ్డి తదితరులు హాజరయ్యారు. కొవ్వొత్తులు వెలిగించి క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ ఇతర పర్వదినాలతో పాటు క్రిస్మస్‌ను ఏటా ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిరుపేదలు, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వైద్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టారన్నారు. అనంతరం ప్రార్థనామందిరం సంఘ కాపరి రెవరెండ్ బెన్హర్‌బాబు వాక్యపరిచర్య చేశారు. కోయర్ బృందాల ఆటపాటలు సందడిగా సాగాయి. కార్యక్రమంలో పాస్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రెవరెండ్ నెహమ్యా నాగరాజు, మైనార్టీ శాఖాధికారి మహ్మద్ రఫీ, వక్ఫ్‌బోర్డు చైర్మన్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చవ్వా రాజశేఖరరెడ్డి, నాయకులు గౌస్‌బేగ్, సైఫుల్లా బేగ్ తదితరులు పాల్గొన్నారు.

జనవాక్కు

మా జీవితాల్లో వెలుగు నింపారు



మాది విజయవాడ. మా ఏకైక కుమార్తె కోమలేశ్వరి బాయిని పామిడిలోని యువకుడికి ఇచ్చి పెళ్లి చేశాం. 2020లో కరోనా కారణంగా అక్కడ పనులు దొరక్క పోవడంతో భర్త లక్ష్మణరావుతో కలసి పామిడికి వలస వచ్చాం. అప్పటి నుంచి ఇక్కడే కుట్టుపనితో జీవనం సాగిస్తున్నాం. మా ఆధార్ కార్డులను వలంటీర్ సాయంతో ఇక్కడికే మార్పు చేయించుకున్నాం. ప్రమాదంలో నా భర్త కాలు విరగడంతో ఆరోగ్యశ్రీ కింద అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయించారు. బ్రెస్ట్ క్యాన్సర్‌తో బాధపడుతున్న నాకూ గత ఏడాది అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్ చేశారు. ఇప్పటికీ అదే ఆస్పత్రి ద్వారా నేను వైద్య సేవలు పొందుతున్నా. ఆసరా, పింఛన్, చేయూత తదితర పథకాలతో మాకు రూ.లక్షన్నర వరకు లబ్ధి చేకూరింది. ఇంత మేలు చేసిన జగన్ ప్రభుత్వాన్ని మేము ఎన్నటికీ మరువం.
– ఎస్.చిన్ని అమృతాబాయి, లక్ష్మణరావు దంపతులు, పామిడి

సీఎం జగన్‌కు రుణపడి ఉన్నా



నా తల్లిదండ్రులు కృష్ణ, రమాదేవి వ్యవసాయ కూలి పనులు చేస్తూ నన్ను, నా తమ్ముడు చంద్రశేఖర్‌ను చదివిస్తున్నారు. ఒకటిన్నర సంవత్సరం క్రితం ఆటో ప్రమాదంలో నా ఎడమకాలు విరిగింది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకున్నా. రూ.50 వేల ఖర్చుతో కూడుకున్న ఆపరేషన్‌ను ప్రభుత్వ సాయంతో ఉచితంగా చేయించుకోగలిగా. ప్రస్తుతం నేను బాగా నడవ గలుగుతున్నా. విద్యాదీవెన పథకం లబ్ధి చేకూరడంతో గుంటూరులో బీటెక్ చేస్తున్నా. పేదలకు అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌కు ఎంతో రుణపడి ఉన్నాం.
– జి.గణేష్, బీటెక్ విద్యార్థి, చీమలవీధి, పామిడి

పోలీసు శాఖకు కీర్తి తేవాలి



ఎస్ఐ ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానించిన దృశ్యం

అనంతపురం క్రైం: ఉద్యోగంలో చేరాక పోలీసు శాఖకు కీర్తి తేవాలని అదనపు ఎస్పీ విజయ భాస్కర్ రెడ్డి సూచించారు. జిల్లా పోలీసు శాఖ ద్వారా కోచింగ్ పొందిన ముగ్గురు ఇటీవల విడుదలైన ఎస్ఐ పరీక్ష ఫలితాల్లో ఉద్యోగాలు సాధించారు. కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన గౌతమ్, అనంతపురం నగరానికి చెందిన విద్యశ్రీ, శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లికి చెందిన ప్రైసీలను శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీసు కాంపిటేటివ్ ఎగ్జామ్స్ స్టడీ సెంటర్ కమ్ డిజిటల్ లైబ్రరీ ద్వారా 120 మందికి శిక్షణ ఇచ్చామన్నారు. వీరిలో దేహదారుఢ్య పరీక్షలు, ఈవెంట్స్‌లో 65 మంది అర్హత సాధించి మెయిన్స్ పరీక్షలు రాశారన్నారు. అందులో ముగ్గురు ఉద్యోగాలు సాధించినట్లు వెల్లడించారు. జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు వారిని సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ జాకీర్ హుస్సేన్ ఉన్నారు.

ట్రాక్టర్, ద్విచక్ర వాహనం ఢీ

- యువకుడి మృతి, మరొకరికి గాయాలు



ఉమేష్ (ఫైల్ ఫోటో)

బొమ్మనహాళ్: ట్రాక్టర్, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఉమేష్ (25) అనే యువకుడు మృతి చెందాడు. మరో యువకుడు గాయపడ్డాడు. ఈ సంఘటన మండలంలోని ఉద్దేహాళ్ గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు.. ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన ఉమేష్ మొబైల్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తుండేవాడు. శనివారం సాయంత్రం వ్యక్తిగత పనిపై స్నేహితుడు సింహాద్రితో కలిసి ద్విచక్ర వాహనంలో బళ్లారి వెళ్లాడు. పని ముగించుకొని స్వగ్రామానికి తిరిగి వస్తుండగా.. ఉద్దేహాళ్ గ్రామ సమీపంలో మలపనగుడి గ్రామానికి చెందిన దుర్గేష్‌కు చెందిన వరిగడ్డి ట్రాక్టర్ ఎదురుగా ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఉమేష్‌ను స్థానికులు అంబులెన్స్‌లో బళ్లారి విమ్స్‌కు తరలించగా... చికిత్స ఫలించక మృతి చెందాడు. సింహాద్రికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడు ఉమేష్‌కు రెండు సంవత్సరాల క్రితం వివాహమైంది. భార్య రాజేశ్వరి, ఎనిమిది నెలల పాప ఉన్నారు. బొమ్మనహాళ్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

సెమీ క్రిస్మస్ వేడుకలు



ఆత్మకూరులో సెమీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా విద్యార్థుల ప్రదర్శన

ఆత్మకూరు: మండలంలోని హోలిస్పిరిట్ పాఠశాలలో శనివారం పెద్ద ఎత్తున సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఎంపీడీఓ రఘునాథ్, ఎంపీపీ హేమలత, పలువురు అధికారులు సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు నాటకాలు, డ్యాన్సులు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

శుద్ధజల యంత్రాలు ప్రారంభం

అనంతపురం రూరల్: అంధుల బాలబాలికల వసతి గృహాల్లో దాతలు అందించిన శుద్ధజల యంత్రాలను విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ అబ్దుల్ రసూల్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ శ్రీలంక దేశానికి చెందిన నిర్మలన్ దంపతుల రూ. 60 వేల విలువ చేసే శుద్ధజల యంత్రాలను అందించారు.

సెంట్రల్ వర్సిటీలో వికసిత్ భారత్



కార్యక్రమంలో పాల్గొన్న సెంట్రల్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎస్ఏ కోరి

అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో శనివారం వికసిత్ భారత్ 2047 వాయిస్ ఆఫ్ యూత్' మిషన్‌లో భాగంగా పలు కార్యక్రమాలను నిర్వహించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ , మనస్తత్వ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ' ఆరోగ్యం-ఆవశ్యకత' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాసాన్ని ఏర్పాటు చేశారు. పొలిటికల్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో భారతదేశంలో నవశకం - భావజాలాన్ని ప్రోత్సహించే చర్చ నిర్వహించారు. సెంట్రల్ వర్సిటీ వీసీ ఎస్ఏ కోరి మాట్లాడుతూ భారతదేశం సంపూర్ణంగా అభివృద్ధి చెందిన దేశం నిలవాలి' అనే కలను సాకారం చేయడంలో వర్సిటీలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీన్ ప్రొఫెసర్ సి.శీలారెడ్డి పాల్గొన్నారు.

నూతన ఛాంబర్ ప్రారంభం



నూతన ఛాంబర్‌ను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమ

అనంతపురం: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమాదేవి అధునాతన ఛాంబర్‌ను శనివారం ప్రారంభించారు. రూ.5.25 లక్షల ఖర్చుతో ఛాంబర్‌ను ఆధునీకరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ, మాజీ అధ్యక్షుడు ఎల్ఎం మోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎల్ ఎం విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి సాఫ్ట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలు



సాఫ్ట్‌బాల్ సీనియర్ క్రీడాకారులతో రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ వెంకటేశులు

అనంతపురం:సాఫ్ట్‌బాల్ జాతీయ స్థాయి సీనియర్ ఫెడరేషన్ కప్ పోటీలు మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో ఈ నెల 25 నుంచి 28 వరకు నిర్వహించనున్నారు. ఇందులో పాల్గొనబోవు ఆంధ్రప్రదేశ్ పురుషుల, మహిళల జట్లకు వారం రోజులుగా ఆర్డీటీ క్రీడా గ్రామంలో క్యాంప్ నిర్వహించారు. శనివారం క్యాంప్ ముగిసిన సందర్భంగా రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ వెంకటేశులు, రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగేంద్ర, కోచ్‌లు బద్రి సాయి, సింహాద్రి క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. సాఫ్ట్‌బాల్‌కు జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు ఉందని, ఆంధ్రప్రదేశ్ జట్టు విజయం సాధించాలని ఆకాంక్షించారు. సాఫ్ట్‌బాల్ క్రీడను ప్రోత్సహిస్తున్న ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూ ఫెర్రర్ సహకారం ప్రశంసనీయమన్నారు.

వైఎస్సార్‌సీపీ యూత్ కన్వీనర్ల నియామకం

కనగానపల్లి: రాప్తాడు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు కొత్తగా వైఎస్సార్‌సీపీ యూత్ కన్వీనర్లను నియమించారు. ఈ నియామకంపై శనివారం సాయంత్రం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. రాప్తాడు మండల యూత్ కన్వీనర్‌గా బి.విశ్వనాథరెడ్డి, ఆత్మకూరుకు జీ.కొండారెడ్డి, కనగానపల్లి నుంచి అంకే అశోక్, రామగిరికి పీ నరేంద్ర, చెన్నేకొత్తపల్లికి బి.చిరంజీవి, అనంతపురం రూరల్-1కు కిరణ్‌కుమార్‌రెడ్డి, అనంతపురం రూరల్- 2కు కె. శ్రీనివాసులును నియమించారు.

వైకుంఠ వాసా..నమోనమః

- వైష్ణవాలయాల్లో పోటెత్తిన భక్తజనం
- గోవింద నామస్మరణతో మార్మోగిన నగరం



ఆర్ఎఫ్ రోడ్డులోని వేంకటేశ్వర స్వామి



రామనగర్ వేంకటేశ్వరుడు



ఆర్ఎఫ్ రోడ్డులో ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారిని దర్శించేందుకు క్యూలో ఉన్న భక్తులు



పూజల్లో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం కల్చరల్: పవిత్ర ధనుర్మాసంలో వచ్చిన ముక్కోటి ఏకాదశి నాడు నగరం జన సంద్రంగా మారింది. వైష్ణవాలయాలు భక్తులతో పోటెత్తాయి. అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీదేవి భూదేవి సహిత శ్రీనివాసుడు వైకుంఠ ఏకాదశి పుణ్య దినాన విశేష పూజలు అందుకున్నారు. శనివారం తెల్లవారుజాము నుంచే భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఉత్తరాయన కాలంలో వైకుంఠద్వారం ద్వారా ప్రవేశం చేసి, ముక్కోటి దేవతలను దర్శించుకున్నారు. పాతూరులోని ప్రాచీన చెన్నకేశవస్వామి ఆలయంలో ముక్కోటి పూజలు వైభవంగా జరిగాయి. భక్తులు దాదాపు కిలోమీటర్ దూరం బారులుదీరి వైకుంఠ వాసుడిని దర్శించుకున్నారు. ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం అర్ధరాత్రి నుంచి భక్తులతో రద్దీగా మారింది. ఉదయం 4 గంటల్లోపు స్వామికి అలంకారసేవ, పూజలు నిర్వహించారు.

అనంతపురం సిటీ: అనంతపురం పాతూరు చెన్నకేశవ స్వామి ఆలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ శనివారం పూజలు నిర్వహించారు. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. ఆమెను శాలువా కప్పి సత్కరించారు.



చెన్నకేశవ ఆలయంలో ముఖద్వారం నుంచి లోపలకి వెళ్తున్న భక్తులు

రాప్తాడు: మండలంలోని ఆలయాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. పండమేటి రాయుడు, చిన్నయనగర్‌లో వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి. హంపాపురంలోని మౌనగిరిక్షేత్రంలోని 39 అడుగుల ఆంజనేయస్వామి ఆలయంలో వేంకటేశ్వరస్వామికి మౌనగిరి వ్యవస్థాపకుడు ఈశ్వరయ్య స్వామి ప్రత్యేక పూజలు చేశారు.

ఆత్మకూరు: మండలంలోని అన్ని ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంపనూరు కొండపై ఉన్న మలహోబిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేపచెర్ల కొండపై ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి, కల్యాణోత్సవం నిర్వహించారు. ఆత్మకూరులోని వాసవీమాత ఆలయంలో పూజలు నిర్వహించారు.



పూజలందుకున్న స్వామివారు



రాప్తాడు: చిన్మయనగర్‌లో వేంకటేశ్వర స్వామి



పంపనూరు కొండపై లక్ష్మీనరసింహస్వామి



వేపచెర్ల కొండపై ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వర స్వామి



అలంకరణలో వేంకటేశ్వర స్వామి దంపతుల ఉత్సవ విగ్రహాలు



ఆత్మకూరు అయ్యప్పఆలయంలో భజనలు చేస్తున్న దృశ్యం

ఉమ్మడి జిల్లాపై చలి పంజా

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లాపై చలి పంజా విసురుతోంది. ఉదయం గజగజ వణికేలా చలితీవ్రత పెరిగింది. ఈ నెల 14న కనిష్ట ఉష్ణోగ్రలతో చలిగింతలు మొదలు కాగా... మళ్లీ వారం రోజుల పాటు కొంత స్థిరంగా నమోదయ్యాయి. అయితే శనివారం ఉదయం ఈ సీజన్‌లో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో ఉష్ణోగ్రతలు 11.5 డిగ్రీలకు పడిపోగా... అనంతపురం జిల్లా కుందుర్పిలో 13.1 డిగ్రీల కనిష్టం నమోదైంది. నల్లమాడ 12.7 డిగ్రీలు, రొద్దం 12.8, గాండ్లపెంట 12.9, కనగానపల్లి 13.2, పరిగి, తనకల్లు 13.3, కొత్తచెరువు 13.4, గుడిబండ, రొళ్ల 13.5, లేపాక్షి, శెట్టూరు 13.6, సోమందేపల్లి 13.8, హిందూపురం 13.9 డిగ్రీల మేర కనిష్టం నమోదయ్యాయి. అలాగే విడపనకల్లు, పుట్లూరు, గార్లదిన్నె, అనంతపురం, బుక్కరాయసముద్రం, కణేకల్లు, బొమ్మనహాళ్, బ్రహ్మసముద్రం, కంబదూరు, డి.హిరేహాళ్, అమడగూరు, తలుపుల, అమరాపురం, అగళి, గోరంట్ల తదితర మండలాల్లో కూడా ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. మొత్తం మీద మడకశిర, హిందూపురం, పుట్టపర్తి, పెనుకొండ, కదిరి, రాయదుర్గం, అనంతపురం, కళ్యాణదుర్గం ప్రాంతాల్లో చలితీవ్రత కాస్త అధికంగా ఉంది. వేకువజామున పొగమంచు కప్పేస్తుండగా జాతీయ రహదారుల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.

భగవద్గీత పఠనం.. సకల సమస్యల పరిష్కార మార్గం

అనంతపురం కల్చరల్: భగవద్గీత అన్ని సమస్యలకూ చక్కటి పరిష్కార మార్గమని వక్తలు అన్నారు. శనివారం స్థానిక రామచంద్రానగర్‌లోని టీటీడీ కల్యాణ మండపంలోగీతా జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో భగవద్గీత కంఠస్థ పోటీలు, సాంస్కృతిక సంబరాలు జరిగాయి. టీటీడీ ప్రోగ్రాం అసిస్టెంట్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, ప్రముఖ సంస్కృత పండితులు కేకేఎన్ శర్మ, డాక్టర్ ఉదయ్, పండిట్ వేణు, గీతాజయంతి విశిష్టతపై తెలియజేశారు.

సాధికార యాత్ర విజయవంతం చేద్దాం





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు

- 29న పాతూరు గాంధీ విగ్రహం వద్ద బహిరంగ సభ
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని పాతూరు గాంధీ విగ్రహం వద్ద ఈనెల 29న జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్ర సభను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నియోజకవర్గం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని అంబేడ్కర్ భవన్ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సామాజిక సాధికార బస్సు యాత్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 29న నిర్వహించే బస్సు యాత్ర రానున్న ఎన్నికలకు జైత్రయాత్ర కావాలన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు జెడ్పీ కార్యాలయం సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి పాతూరు వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. సాయంత్రం 3.30 గంటలకు పాతూరు గాంధీ విగ్రహం వద్ద బహిరంగ సభ ఉంటుందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా భారీగా జనం తరలివచ్చేలా చూడాలన్నారు.

ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా దుష్ప్రచారం:
జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన సాగిస్తుంటే చంద్రబాబు, ప్రతిపక్ష పార్టీలు, ఓ వర్గం మీడియా దుష్ప్రచారం చేస్తున్నాయని ఎమ్మెల్యే అన్నారు. 14 ఏళ్ల సీఎంగా పని చేసిన చంద్రబాబుతో ప్రజలకు ఎలాంటి మేలూ జరగలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజకీయ పదవులు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ విషయాలన్నింటినీ బస్సు యాత్ర ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్దామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదర్శవంతమైన పాలననందిస్తున్నారని జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పేర్కొన్నారు. గతంలో చంద్రబాబు బడుగు, బలహీన వర్గాలను అవమానించారని, మైనార్టీలపై కేసులు నమోదు చేసేలా అధికారాన్ని వాడుకున్నారన్నారు. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య మాట్లాడుతూ మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చేసుకుందామన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్ మాట్లాడుతూ బీసీలు వెనుకబడిన కులాలు కాదని, బీసీలు బ్యాక్ బోన్ అని భావించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, బడుగులు అన్ని విధాలా ప్రగతి సాధించేలా చర్యలు తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, అనుబంధ సంఘాల అధ్యక్షుడు ఎగ్గుల శ్రీనివాసులు, శ్రీదేవి, సైఫుల్లాబేగ్, కృష్ణవేణి, జేసీఎస్ కన్వీనర్లు చింతా సోమశేఖర్ రెడ్డి, చింతకుంటమధు, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, రాజీవ్‌కాలనీ సర్పంచ్ ఆశాబీ, పార్టీ సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జ్ రిలాక్స్ నాగరాజు, పార్టీ నాయకులు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, రాధాకృష్ణ, గుజ్జల లక్ష్మణ్, రాధాయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

138 మందికి ఫారిన్ లాంగ్వేజెస్ డిప్లొమా సర్టిఫికెట్లు

అనంతపురం:శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం-ఆర్డీటీ (రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్) సంయుక్తంగా ఫారిన్ లాంగ్వేజెస్ డిప్లొమా కోర్సులకు సంబంధించి 138 మందికి డిప్లమో సర్టిఫికెట్లు అందించారు. ఆర్డీటీ ఆధ్వర్యంలో ఫారిన్ లాంగ్వేజెస్‌లో (జర్మన్, ఫ్రెంచ్, స్పానిష్) 2012 నుంచి ఏడాది డిప్లొమా కోర్సులు అందుబాటులోకి తెచ్చారు. ఇందులో విద్యార్థులు లెవల్-1, లెవల్-2, బీ-1 స్థాయి వరకు ఏడాది పాటు ఆన్‌లైన్ శిక్షణ ఇచ్చారు. డిప్లొమో కోర్సుల్లో మొత్తం 138 మంది విద్యార్థులు ఉత్తీర్ణత చెందారు. వీరిలో 51 మంది విద్యార్థులకు వివిధ కంపెనీల్లో కొలువులు దక్కాయి. తక్కిన వారికి త్వరలోనే ఉద్యోగాలు కల్పించనున్నట్లు ఆర్డీటీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ బి. మోహన మురళీ తెలిపారు. సర్టిఫికెట్ల ప్రదానం కార్యక్రమంలో ఆర్డీటీ డైరెక్టర్‌తో పాటు ఎస్కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ. కృష్ణకుమారి, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ నరసింహన్, స్కిల్‌డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ నాగభూషణ రాజు, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కే శ్రీరాములు నాయక్, ఆర్డీటీ ఫారిన్ లాంగ్వేజెస్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ వి. గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.



డిప్లొమా సర్టిఫికెట్లను ఆర్డీటీ ప్రతినిధులకు అందిస్తున్న ఎస్కేయూ ఉన్నతాధికారులు

జగన్‌తోనే సంక్షేమ రాజ్యం సాధ్యం

చెన్నేకొత్తపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే పేద బడుగు, బలహీనవర్గాల సంక్షేమం సాధ్యమని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని ప్యాదిండి, గొల్లవాండ్లపల్లి, నామాల గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆయా గ్రామాల్లో పర్యటించి, ఇంటింటికీ తిరుగుతూ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోమారు ముఖ్యమంత్రిగా గెలుపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నర్సిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గాయత్రి నరసింహారెడ్డి, సర్పంచ్ యర్రమ్మ, సింగిల్‌విండో ప్రెసిడెంట్ రామచంద్రారెడ్డి, నాయకులు కృష్ణమూర్తి, ఆదినారాయణరెడ్డి, ఓబిరెడ్డి, రామకృష్ణ, సుధాకర్‌రెడ్డిపాల్గొన్నారు.



ప్యాదిండిలో పథకాల వివరాలను తెలియజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, నాయకులు

ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేద్దాం

- మండల ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్

ఆత్మకూరు: ఈనెల 26 నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడలు నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్, ఎంపీడీఓ రఘునాథ్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి, మానవహారం ఏర్పాటు చేశారు. ఆత్మకూరు ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని పరిశీలించారు. మండల వ్యాప్తంగా అన్ని క్రీడలకు సంబంధించి మొత్తం 118 టీమ్‌లు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, ఎంఈఓ నరసింహారెడ్డి, పంచాయతీ సెక్రటరీ శిరీష, మహిళా పోలీస్ అనురాధ, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి ఆడుదాం- ఆంధ్రా

రాప్తాడు: ఈ నెల 26 నుంచి నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపీడీఓ సాల్మన్ తెలిపారు. శనివారం ఆడుదాం ఆంధ్రాపై కార్యక్రమంపై అధికారులు, ప్రజా ప్రతినిధులు రాప్తాడులో ర్యాలీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి క్రీడా రంగానికి పెద్ద పీట వేశారన్నారు. క్రీడలపై ఆసక్తి ఉన్న యువతీయువకులు పేర్లు నమోదు చేసుకోవాలని అన్నారు.

దౌర్జన్యంగా ప్రహరీ నిర్మిస్తున్నాడని ఫిర్యాదు

అనంతపురం టవర్‌క్లాక్: కక్కలపల్లి కాలనీ సమీపంలోని బీజేపీ కాలనీలో నెట్టెం ఆనంద్ అనే వ్యక్తి ప్రహరీ నిర్మించి, ఇబ్బందులకు గురి చేస్తున్నాడని సర్పంచ్ కృష్ణయ్య రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని కోరారు. శనివారం ఆర్ అండ్‌బీ అతిథిగృహంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాస్‌రెడ్డిని కాలనీవాసులతో కలిసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు దామ్లానాయక్, రామదాసు నాయక్, నరేష్ నాయక్, ఈశ్వర్‌రెడ్డి, రాము, రామాంజనేయులురెడ్డి, నారాయణస్వామి, రామాంజి పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులను పరిరక్షించాలి

అనంతపురం కార్పొరేషన్: వినియోగదారుల హక్కులను పరిరక్షించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. శనివారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఏదైనా వస్తువు కొనుగోలు చేసే ముందు దాని గడువు తేదీని తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వినియోదారుల హక్కుల పరిరక్షణ సంస్థ అధ్యక్షుడు మోహన్, కార్యదర్శి అసదుల్లా మాటాల్డుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో అనవసరమైన టెస్టులు రాయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ యుగంధర్, డాక్టర్ సుజాత, డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ రవిశంకర్, డాక్టర్ గంగాధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి

భక్తిశ్రద్ధలతో సుందర శ్రీకర మహాయాగం

అనంతపురం కల్చరల్: చంద్రశేఖరేంద్ర సరస్వతీ జ్ఞానపీఠం ఆధ్వర్యంలో సుందర శ్రీకర మహాయాగం శనివారం ఘనంగా ప్రారంభమైంది. చెన్నైకి చెందిన గుహానంద మండలి వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ గోటేటి శ్రీనివాసరావు, మధుసూదనరావు నేతృత్వంలో ఉదయం గోపూజలు, కలశస్థాపన, సుందరాకారుడు హనుమంతుడికి విశేష చందన అలంకారం చేశారు. 70 మంది వేద పండితుల మంత్రోచ్ఛారణలతో నగరంలోని రెండోరోడ్డు చంద్రశేఖరేంద్ర సరస్వతీ జ్ఞాన పీఠం యాగశాల ప్రతిధ్వనించింది. ఉదయం గాయత్రి, ఉత్తిష్ఠశ్రీకర హోమాలు, సాయంత్రం విష్ణు సహస్రనామ హోమం, నక్షత్రసూక్త సహిత శ్రీకర హోమం నిర్వహించారు.

నేడు రాయలసీమ మహాసభలు

అనంతపురం టవర్‌క్లాక్: స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎంహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో రాయలసీమ మహాసభలు ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పసులూరు ఓబులేసు ఓ ప్రకటనలో తెలిపారు. డప్పు కళాకారులు, పింఛన్ ఉద్యమ కారులు, మాదిగలు రాయలసీమ మహాసభకు పెద్ద ఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు.

కురుబలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

అనంతపురం టవర్‌క్లాక్: కురుబలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని రాష్ట్ర కురుబ సంఘం అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు కోరారు. శనివారం స్థానిక గుత్తిరోడ్డులోని కనకదాసు కల్యాణ మంటపంలో కురుబ సంఘం సమావేశం నిర్వహించారు. బోరంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు కర్నూలు, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో ఒక్కో ఎంపీ స్థానం కురుబలకు ఇవ్వాలన్నారు. ప్రతి జిల్లాలోనూ ముగ్గురు ఎమ్మెల్యే స్థానాలు కేటాయించాలన్నారు. తిరుపతిలో భక్త కనకదాసు పీఠానికి స్థలం కేటాయించాలన్నారు. అన్ని నియోజకవర్గాల్లో కురుబ సంఘం కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం రాష్ట్ర కమిటీకి 123 మందిని ఎన్నుకొని వారితో ప్రమాణస్వీకారం చేయించారు. ఎస్ఐలుగా అర్హత సాధించిన ఆరుగురిని సన్మానించారు. కురుబ సంఘం ఎన్నికల కమిటీ చైర్మన్ ఈశ్వరయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీష్, మహిళా అధ్యక్షురాలు శివబాల, కురుబ యువజన సంఘం అధ్యక్షుడు లింగప్రసాద్, గౌరవాధ్యక్షుడు నాగభూషణం, వర్కింగ్ ప్రెసిడెంట్ మురళి, రెడ్డి ప్రసాద్, కృష్ణమూర్తి, శ్రీనివాసరావు, హరినాథ్, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఈశ్వరయ్య, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు హేమంత్, నారాయణ బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బోరంపల్లి ఆంజనేయులు

లక్ష్యం నిర్దేశించుకోవాలి

రాప్తాడురూరల్:పోటీ పరీక్షలు రాసేవారు లక్ష్యం నిర్దేశించుకొని చదవాలని, అప్పుడే కొలువులు సాధించగలరని గ్రామ పెద్దలు, సీపీఐ నాయకులు అన్నారు. అనంతపురం మండలం కందుకూరుకు చెందిన కె.మధుసూదన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (ఎస్ఐ)కు ఎంపిక కావడంతో శనివారం గ్రామంలో ఆయన్ను సన్మానించారు. వారు మాట్లాడుతూ కష్టపడి ఎస్ఐగా ఎంపిక కావడం గ్రామానికి గర్వకారణమని, యువత అతన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు శ్రీరాములు, పెద్దన్న, రామచంద్ర, పూజారప్ప, బ్రహ్మయ్య, రామాంజనేయులు, కొండయ్య, పూజారప్ప, ఓబులేసు, జంగాలపల్లి హుస్సేన్ పీరా తదితరులు పాల్గొన్నారు.



మధుసూదన్, అతని తల్లిదండ్రులను సన్మానిస్తున్న దృశ్యం